మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని..

యువకుడి ఆత్మహత్య

వాంకిడి, మార్చి 26 : మద్యం తాగడానికి డబ్బులు ఇవ్వలేదని మనస్తాపానికి గురై యువకుడు ఆత్మహత్య చేసుకొన్న ఘటన వాంకిడి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ రాములు తెలిపిన వివరాల ప్రకారం.. సోనాపూర్ పంచాయతీ పరిధిలోని పూనగూడకు చెందిన మాడావి సురేశ్ (18) మద్యానికి బానిసై రోజూ తల్లి మాడావి పార్వతితో గొడవపడేవాడు. సోమవారం హోలీ ఆడడానికి ఉదయం వెళ్లి, మధ్యాహ్నం 3 గంటలకు ఇంటికి తిరిగి వచ్చిన సురేశ్ మద్యానికి డబ్బులు ఇవ్వాలని తల్లితో గొడవ పడ్డాడు. దీంతో 'నీ తండ్రి చనిపోయి రెండు సంవత్సరాలు అవుతుంది. ఆసరాగా ఉంటావనుకున్న నువ్వే ఇలా మద్యం తాగి డబ్బులు వృథా చేస్తే ఎలా, నా దగ్గర డబ్బులు లేవు' అని తల్లి మందలించింది. దీంతో సురేశ్ కోపంతో బయటకెళ్లి పరుగులమందు తాగాడు. తిరిగి ఇంటికి వచ్చి వాంతులు చేసుకుంటూ స్పృహతప్పి పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు ద్విచక్ర వాహనంపై వాంకిడి ప్రభుత్వ దవాఖానకు తీసుకువెళ్లారు. అక్కడి నుంచి అంబులెన్స్‌లో ఆసిఫాబాద్ ప్రభుత్వ దవాఖానకు, అనంతరం బెల్లంపల్లి దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. పార్వతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

పంటలకు పందుల బెడద

అడవి పందులు ధ్వంసం చేసిన వరి పంట

- మండలంలో 520 ఎకరాల్లో యాసంగి వరి సాగు
- చేతికి వచ్చిన పంటను ధ్వంసం చేస్తున్న అటవీ జంతువులు
- ఆందోళన చెందుతున్న రైతులు

పెంచికల్ పేట్, మార్చి 26 : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వం రైతుల కోసం 24 గంటల ఉచిత కరెంటు, రైతు బంధు, రైతు బీమా, వరి కల్లాల నిర్మాణం, కొనుగోలు కేంద్రాలు, రైతు వేదికలు ఏర్పాటు చేసి రైతులను వ్యవసాయంపై మక్కువ పెరిగేలా ప్రోత్సహించింది. దానికి అనుగుణంగా రైతులు రెండు పంటలపై మొగ్గు చూపారు. వరితోపాటు, తృణధాన్యాల సాగు, ప్రత్యామ్నాయ పంటలు, వాణిజ్య పంటలు, ఆయిల్ పామ్ తదితర సాగుపై దృష్టి సారించారు.

మండలంలో ఉచ్చమల్లి వాగు, బొక్కి వాగు ప్రాజెక్టులు. బోరు బావులపై ఆధారపడి 520 ఎకరాల్లో యాసంగి వరి సాగు చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక కరెంటు కోతలు, రైతుబంధు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. పంట చేతికొచ్చిన సమయంలో అడవి పందులు విధ్వంసం చేస్తున్నాయి. వాటి నుంచి పంట రక్షించేందుకు రాత్రింబగళ్లు కాపలా కాస్తున్నా, పంట చుట్టూ రంగురంగుల చీరెలతో కంచె వేసిన ఫలితం దక్కడం లేదని వాపోతున్నారు. పంట పొలాలకు వచ్చిన అడవిపందులను కొట్టినా, చంపినా ఫారెస్ట్ అధికారులు వన్య ప్రాణుల సంరక్షణ చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నారు. పందులు పంటలను ధ్వంసం చేస్తే మేమేం చేయాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. కనీసం రక్షించేందుకు పంట చుట్టూ వైర్లు ఏర్పాటు చేసుకుంటే వైర్లను ఫారెస్ట్ అధికారులు తొలగిస్తూ రైతులను ఇబ్బంది పెడుతున్నారు. అడవి పందుల బెడద నుంచి పంటను రక్షించేందుకు రైతులకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతున్నారు.

రాత్రింబవళ్లు పాలాల్లో ఉంటున్నాం

ఎల్కపల్లి శివారులో మూడెకరాల్లో యాసంగి వరి సాగు చేస్తున్నా. ఇప్పటికే వరి గింజలు బయటకు వస్తున్నాయి. చేతికి వచ్చిన వరి పంటను కాపాడుకునేందుకు రాత్రి, పగలు తేడా లేకుండా పంట పొలాల్లో కాపు కాస్తున్నాం. అయినా అటవీ జంతువులు పంటను ధ్వంసం చేస్తున్నాయి. సంబంధిత అధికారులు ప్రత్యామ్నాయ మార్గం చూపించాలి.

-పోతుగంటి పోశన్న, రైతు (ఎల్కపల్లి)

సోలార్ జట్కా మిషన్ అందించాలి

వరి పంటను అడవి పందుల బెడద నుంచి రక్షించుకునేందుకు రైతులకు ప్రభుత్వం సోలార్ జట్కా మిషన్ ఉచితంగా అందించి ఆదుకోవాలి. ఎలాంటి విద్యుత్ సోలార్ కనెక్షన్ లేకుండా సొంతగా వైర్లను ఏర్పాటు చేసుకుంటే ఫారెస్ట్ అధికారులు తీసుకెళ్తున్నారు. మరి పంటను ఎలా రక్షించుకోవాలో అర్థం కావడం లేదు. అధికారులే మార్గం చూపించాలి.

-తెలిగే శంకర్, రైతు (ఎల్కపల్లి)

జనగామ పోచం మృతి తీరని లోటు

పోచం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

ఆసిఫాబాద్ టౌన్, మార్చి 26: జనగామ పోచం మృతి మాదిగ జాతికి తీరని లోటని ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకుడు రేగుంట కేశవ్‌రామ్ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని డాక్టర్ బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద పోచం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కళామండలి అధ్యక్షుడు జనగాం పోచం మాదిగ గుండెపోటుతో మరణించడం మాదిగ జాతికి తీరనిలోటన్నారు. ఎస్సీల వర్గీకరణ కోసం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామగ్రామాన కాళ్లకు గజ్జెలు కట్టి, గొంగడి, డప్పు చంకన వేసుకొని ఆటలాడుతూ, పాటలు పాడుతూ మాదిగ జాతిని మేల్కొలిపిన మహనీయుడని కొనియాడారు. ఇక్కడ బేడ, బుడగ జంగాల రాష్ట్ర కార్యదర్శి హస్తం అంజన్న, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు రేగుంట సాగర్, తిరిగి నాల సురేశ్, రేగుంట మహేశ్, బేడ బుడగ జంగాల జిల్లా నాయకులు సమ్మయ్య, రుద్రాక్షల నర్సయ్య, సిలారి మల్లేశ్ పాల్గొన్నారు.

సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలి

ఉట్నూర్, మార్చి 26: ప్రభుత్వ దవాఖానల్లో సాధారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఐటీడీఏ పీవో ఖుష్బూగుప్తా పేర్కొన్నారు. మంగళవారం ఉట్నూర్‌లోని పీవో క్యాంపు కార్యాలయంలో ఉమ్మడి జిల్లాలోని వైద్య ఆరోగ్య శాఖలోని 32 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఎంసీహెచ్ యాక్టివిటీస్, వ్యాధి నిరోధక టీకాలు, ఏఎన్‌సీ చెకప్, ఇమ్యూనైజేషన్ వంద శాతం పూర్తి చేయాలన్నారు. అలాగే వైద్యసిబ్బంది సమయపాలన పాటించాలని ఆదేశించారు. దవాఖానకు వచ్చే రోగులపై శ్రద్ధ వహించాలని సూచించారు. సమావేశంలో ఏజెన్సీ అదనపు వైద్యాధికారి బాలు, ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాల డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలి

సిర్పూర్ (యూ), మార్చి 26 : రానున్న పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఆసిఫాబాద్ డీఎస్పీ సదయ్య సూచించారు. మంగళవారం మండల కేంద్రంలో పోలీసు కవాతు నిర్వహించి ప్రజలతో మాట్లాడారు. ప్రజలు చట్టవ్యతిరేక కార్యకలాపాల్లో పాల్గొనవద్దన్నారు. నాయకులు, కార్యకర్తలు ప్రచారానికి వచ్చినపుడు వారితో గొడవలు పెట్టుకోవద్దని తెలిపారు. ఎవరి ప్రచారం వారిని చేసుకోనివ్వాలని సూచించారు. నచ్చిన నాయకుడికి ఓటు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో సీఐ అంజయ్య, ఎస్ఐ మాధవ్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావ్ ఉన్నారు.

ధోబీ ఘాట్ లేక రజకుల ఇబ్బందులు

- వేసవిలో ఎండిపోతున్న మత్తడి వాగు
- బోరుబావి ఏర్పాటు చేయాలని సర్కారుకు వినతి



మండల కేంద్రంలోని మత్తడి వాగులో బట్టలు ఉతుకుతున్న రజకులు, నేలపై ఆరబెట్టిన ఉతికిన బట్టలు

బెజ్జూర్, మార్చి 26 : ఎలాంటి మురికి బట్టలైనా తమ చేతికి అందగానే మెరిసే విధంగా ఉతికి ఇస్త్రీ చేసి మనిషి హుందా తనాన్ని కనబరిచేలా కష్టాలు పడుతున్న తమకు ప్రభుత్వం తరపున ఎలాంటి సహాయ సకారాలు అందడంలేదని మండల రజకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బట్టలు ఉతికేందుకు ధోబీ ఘాట్ లేక చాలా ఇబ్బందులు పడుతున్నామన్నారు. మండల కేంద్రంలో 18 రజక కుటుంబాలు ఉన్నాయి. వీరంతా కుల వృత్తినే నమ్మకొని బతుకుతున్నారు. మండల కేంద్రంలోని మత్తడి వాగులో నిత్యం బట్టలుతికే రజకులు ఆరబెట్టడానికి సరైన ఘాట్ లేక పోవడంతో చాలా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఉతికిన బట్టలను వాగులోని ఇసుక, నేలపైనే ఆరబెట్టాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇలా ఆరబెట్టడంతో తిరిగి బట్టలు మురికి కావడంతో రెండు సార్లు ఉతకాల్సి వస్తున్నదన్నారు. సమీపంలోని పల్లె ప్రకృతి వనం కోసం ఏర్పాటు చేసిన ఫెన్సింగ్ వైర్‌పై బట్టలు ఆరబెట్టాల్సి వస్తున్నదని వాపోతున్నారు. మరో వైపు వేసవిలో వాగుల్లో నీరు లభించక చాలా ఇబ్బందులు ఏర్పడుతున్నవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధోబీ ఘాట్ లేకపోవడంతో ఇండ్లలోనే బట్టలు ఉతకాల్సి వస్తున్నదని వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రజకుల కోసం బోరుబావి ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.

ధోబీ ఘాట్ ఏర్పాటు చేయాలి

బట్టలుతికి బతికే రజకులకు మండల కేంద్రంలో ధోబీ ఘాట్ నిర్మించాలి. ధోబీ ఘాట్ లేక పోవడంతో బట్టలు ఉతకడమే కాకుండా ఉతికిన బట్టలను ఆరబెట్టేందుకు కూడా ఇబ్బందులు ఏర్పడుతున్నవి. బట్టలు నేలపై ఆరబెట్టడంతో ఉతికిన బట్టలకు తిరిగి మురికి అంటుతున్నది. దీంతో యజమానుల నుంచి చీవాట్లు వినాల్సి వస్తున్నది. మా గురించి సర్కారు ఆలోచించాలి.

- కడముంత శేఖర్, రజకుడు, బెజ్జూర్

చెప్పడమే కాని చేసే వారు లేరు

ఎలక్షన్ వస్తే చాలు ఆ లీడరు, ఈ లీడరు అందరూ గ్రామాల్లోకి వస్తరు. రజకుల సమస్యలు చెబితే వింటరు. న్యాయం చేస్తమంటరు. కానీ తర్వాత ఎవరూ కనబడరు. కులవృత్తిని చేయకపోతే ఎలా ఉంటుందో చెప్పనక్కరలేదు. మా సేవలైతే అందరికీ కావాలి, కానీ మా కష్టాలు తీర్చెటోళ్లు మాత్రం ఎవరూ ఉండరు. కనీసం సర్కారైనా మా భాదలు తెలుసుకొని కనీస వసతులు కల్పించాలి.

-పొన్న లండు, రజకుడు , బెజ్జూర్

వేసవిలో బట్టలు ఉతకడం చాలా కష్టం

వేసవిలో వాగులు ఎండిపోయినా బట్టలు ఉతకడం మాత్రం తప్పదు. ఇలాంటి పరిస్థితిలో బట్టలు ఉతకడం ఎంత కష్టమో అనుభవించే వారికికే తెలుసు. వాగుల్లో నీరులేని సందర్భాల్లో ఇండ్లల్లో ఉతకాల్సి వస్తుంది. నీరు సరిపోక బట్టలు ఉతకడం వాయిదా వేయాల్సి వస్తున్నది. సర్కారు బోర్ ఏర్పాటు చేసి, సబ్సిడీ లోన్లు, ఇతర పథకాలు ప్రవేశ పెట్టి రజకులను ఆదుకోవాలి

-పోగుల తిరుపతి, రజకుడు, బెజ్జూర్

ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలి

- సీఐ అల్లం రాంబాబు
- లోహలో కార్డన్ సెర్చ్

లోహలో గిరిజనలుతో మాట్లాడుతున్న సీఐ అల్లం రాంబాబు

దహెగాం, మార్చి 26: ఆదివాసీలు అన్ని రంగాల్లో రాణించాలని కాగజ్‌నగర్ రూరల్ సీఐ అల్లం రాంబాబు సూచించారు. మంగళవారం మండలంలోని ఖర్జీ గ్రామ పంచాయతీ పరిధిలోని ఆదివాసీ గిరిజన గ్రామం లోహలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడి గిరిజనులతో సీఐ మాట్లాడారు. ఆదివాసీల పిల్లలు మంచిగా చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. అసాంఘిక కార్యకలాపాలను వీడి మంచిమార్గంలో నడుచుకోవాలని సూచించారు. ముఖ్యంగా మావోయిస్టులకు ఎట్టి పరిస్థితుల్లో సహకరించవద్దని చెప్పారు. ఎవరైనా మావోయిస్టులకు సహకరిస్తే కేసులు నమోదు చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో అర్హులైన వారందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తెలిపారు. గ్రామస్తులకు ఎలాంటి సమస్యలున్నా పోలీసుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఇక్కడ ఎస్ఐ రాజు, పోలీస్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాలి

ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్

తిర్యాణి, మార్చి 26: కొలతల ప్రకారం పనులు జరిగేలా చూడాలని ఎఫ్ఆర్‌వో శ్రీనివాస్ ఈజీఎస్ సిబ్బందికి సూచించారు. తిర్యాణి అటవీ రేంజి పరిధిలో ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా చేపడుతున్న సరిహద్దు కందకాల పనులను మంగళవారం పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. వానకాలంలో నీరు వృథా పోకుండా, భూగర్భజలాలను పెంపొందించేందుకు ఈ కందకాలు ఎంతో అవసరమవుతాయని తెలిపారు. వీటి ద్వారా చెట్ల పెరుగుదలతో పాటు వన్యప్రాణులకు నీటి కొరత లేకుండా ఉంటుందన్నారు. అటవీ ప్రాంతాల్లో నీటి నిల్వ కోసం చిన్న నీటి ఊట కుంటలు, పారంఫాండ్ నిర్మాణాలు అటవీ జంతువులు, పశు,పక్షాదులు దాహార్తిని తీరుస్తాయని తెలిపారు. ఇక్కడ బీట్ అధికారి అంబారావు, సీనియర్ మేట్ దుర్గం పవన్‌కుమార్, కరగంటి మల్లేశ్, ఉపాధి హామీ కూలీలు ఉన్నారు.

పఠనా సామర్థ్యాలు పెంపొందించాలి



ఎంపీపీఎస్‌లో పుస్తక పఠనం చేస్తున్న విద్యార్థిని పరిశీలిస్తున్న అధికారులు

బెజ్జూర్, మార్చి 26 : ప్రాథమిక పాఠశాలల్లో కథలను చదివించడం ద్వారా విద్యార్థుల్లో పఠనా సామర్థ్యం పెరుగుతుందని రూమ్ టూ రీడ్ ప్రతినిధి పల్లె వెంకన్న అన్నారు. మంగళవారం ఆయన మండల కేంద్రంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సీఆర్‌పీ శ్రీనివాస్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూమ్ టూ రీడ్ అందించిన లైబ్రరీలోని కథల పుస్తకాలను విద్యార్థులతో చదివించాలన్నారు. ఒకటి, రెండు తరగతుల విద్యార్థులకు వికాసం-1, 2 పుస్తకాలు చాలా ఉపయోగ పడుతాయని తెలిపారు. ఈ సందర్భంగా కథలను చదువుతున్న విద్యార్థులను అధికారులు పరిశీలించారు. ఇక్కడ సీఆర్‌పీ శ్రీనివాస్, ఐఈఆర్‌పీ విశ్వాస్, ఉపాధ్యాయురాలు సాజిదా సుల్తానా ఉన్నారు.

ఆర్ఎంపీపై వైద్యాధికారి విచారణ

ల్యాబ్‌లో వివరాలు సేకరిస్తున్న విచారణాధికారి

దహెగాం, మార్చి 26 : మండల కేంద్రానికి చెందిన గాదం నీలక్క (55) ఓ ఆర్ఎంపీ అందించిన వైద్యం వికటించి మృతి చెందారని వచ్చిన ఫిర్యాదు మేరకు మంగళవారం వైద్యాధికారి స్పందన విచారణకు వెళ్లారు. క్లినిక్ తాళం వేసి ఉండడంతో పాటు సదరు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో విచారణాధికారి వెనుదిరిగి పోయారు. విచారణాధికారి తెలిపిన వివరాల ప్రకారం, ఈ నెల 22న గాదం నీలక్క అనారోగ్యంతో ఉండగా మండల కేంద్రానికి చెందిన అనల లక్ష్మణ్ అనే ఆర్ఎంపీ (శ్రీఆంజనేయ క్లినిక్) వద్దకు కుటుంబ సభ్యులు తీసుకెళ్లారు. ఆర్ఎంపీ అందించిన వైద్య వికటించి మృతి చెందగా జిల్లా వైద్యాధికారికి కుటుంబీకులు ఫిర్యాదు చేశారు. జిల్లా వైధ్యాధికారి ఆదేశాల మేరకు దహెగాం వైద్యాధికారి స్పందన మంగళవారం మృతురాలి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. అనంతరం ఆర్ఎంపీ వైద్యుడు లక్ష్మణ్ వద్దకు వెళ్లగా క్లినిక్‌కు తాళం వేసి ఉండడంతోపాటు, అందబాటులో లేకుండాపోయాడు. అనంతరం వైద్యశాలకు సమీపంలో ఉన్న ల్యాబ్‌లో నీలక్కకు ఏమైనా టెస్టులు నిర్వహించారా లేదా అనే విషయాలపై ల్యాబ్‌లో పరిశీలించారు. వైద్యుడు అందుబాటులో లేనందున తదుపరి మళ్లీ విచారణ చేపడతామని ఆమె పేర్కొన్నారు.

పంట చేను ధ్వంసం చేశారని డీఎస్పీకి ఫిర్యాదు

కాగజ్‌నగర్ డీఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేయడానికి వచ్చిన ఇట్యాల గ్రామస్తులు

కాగజ్‌నగర్, మార్చి 26: దహేగాం మండలంలోని ఇట్యాల గ్రామానికి చెందిన బాధితులు మంగళవారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్‌కు పంట చేను ధ్వంసం కావడంపై ఫిర్యాదు చేశారు. బాదితుడు మురళి తెలిపిన వివరాల ప్రకారం.. తన తల్లిదండ్లుర సందెల లక్ష్మీ,గురువయ్య పేరిట ఉన్న వ్యవసాయ భూమిని 50 సంవత్సరాలుగా సాగు చేసుకుంటు జీవనం సాగిస్తున్నారు. గతంలో నలుగురు వ్యక్తులు వ్యవసాయానికి ఆటంకం కలిగించడంతో కోర్టును ఆశ్రయించగా తీర్పు అనుకూలంగా వచ్చింది. అప్పటి నుంచి సాగు చేసుకుంటున్నారు. ఈ నెల 25న మధ్యాహ్నం కొందరు వచ్చి వ్యవసాయ భూమిలో అక్రమంగా చొరబడి సోలార్ తీగ, కొయ్యలు, పంట, వాటర్ పైపులను ధ్వంసం చేశారు. అడ్డు కోగా బెదిరింపులకు పాల్పడ్డారు. ఈ విషయమై డీఎస్పీ కరుణాకర్‌కు ఫిర్యాదు చేయగా విచారణ జరిపి న్యాయం చేస్తానని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కౌటాల, మార్చి 26: మండల కేంద్రంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్‌లో చీపురుదుబ్బ ఫీడర్ 11 కేవీ విద్యుత్ లైన్ మరమ్మతుల కారణంగా బుధవారం ఉదయం 11 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు ఏఈ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని గురుడుపేట, కన్నెపల్లి, బోదంపల్లి, కనికి, యాపలగూడ గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు. ఆయా గ్రామాల్లోని విద్యుత్ వినియోగదారులు గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

ఎస్పీని కలిసిన డీఎం

ఎస్పీ సురేశ్‌కుమార్‌కు పూలమొక్క అందజేస్తున్న డీఎం

ఆసిఫాబాద్, మార్చి 26: ఇటీవల ఆర్టీసీ డీఎంగా బాధ్యతలు స్వీకరించిన విశ్వనాథ్ మంగళవారం ఎస్పీ సురేశ్‌కుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిసి, పూలమొక్కను బహూకరించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణలో ట్రాఫిక్ నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా సిబ్బందికి విధులు కేటాయించాలని కోరగా ఎన్నికల అనంతరం సిబ్బందిని ఏర్పాటు చేస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు. ఆర్టీసీ ద్వారా అందుతున్న సేవలను డీఎం వివరించారు. ఇక్కడ సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కౌటాల, మార్చి 26: తాటిపల్లి వార్ధా నదిలో సోమవారం ప్రమాదవశాత్తూ నీటిలో పడి మండల కేంద్రానికి చెందిన పనాసా కమలాకర్, ఉప్పుల సంతోష్, ఎల్ముల్లే ప్రవీణ్, ఆలం సాయిలు మృతి చెందారు. జిల్లా పరిషత్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మృతదేహాలను పరిశీలించి బాధిత కుటుంబీకులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు నక్క శంకర్ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఇక్కడ డీసీఎంఎస్ వైస్ చైర్మన్ కుమ్రం మాంతయ్య, నాయకులు ఉన్నారు.

పశువులకు టీకాలు వేయించాలి

విర్దండిలో పశువుకు టీకా వేస్తున్న పశువైద్యాధికారి శ్రీకాంత్

కౌటాల, మార్చి 26: రైతులు పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి శ్రీకాంత్ సూచించారు. మంగళవారం విర్దండి గ్రామంలో పశు వైద్య శిబిరం ఏర్పాటు చేసి పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలను వేయించి మాట్లాడారు. 4 నెలలు నిండిన పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించాలని రైతులకు సూచించారు. ఇక్కడ పశువైద్య శాల సిబ్బంది సందీప్, రాజన్న, ప్రకాశ్, భిక్షపతి, శోభన్, రైతులు తదితరులు ఉన్నారు.

నీటిని పొదుపుగా వాడుకోవాలి

మండల కేంద్రంలో ర్యాలీ తీస్తున్న విద్యార్థులు

తిర్యాణి, మార్చి 26: నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని ప్రధానోపాధ్యాయుడు షేక్‌రావు, ఆగాఖాన్ ఫౌండేషన్ కోఆర్డినేటర్ రమణి సూచించారు. మండలకేంద్రంలోని గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలలో ఆగాఖాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని కుమ్రంభీం చౌరస్తా నుంచి పాఠశాల వరకు విద్యార్థులతో ర్యాలీ తీశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ జీవకోటికి నీరు ఎంతో ప్రధానమైందన్నారు. పొదుపుగా వాడుకోవడం అందరూ బాధ్యతగా తీసుకోవాలని సూచించారు. నీటిని వృథా చేయడంతో భూగర్భజలాలు అడుగంటుతాయని హెచ్చరించారు. దీంతో భవిష్యత్‌లో నీటి కొరత ఏర్పడే ప్రమాదం ఉందని తెలిపారు. ఇక్కడ పంచాయతీ కార్యదర్శి అంజయ్య, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు జ్యూస్ పంపిణీ

విద్యార్థులకు జ్యూస్ అందజేస్తున్న ఉపాధ్యాయులు

పెంచికల్ పేట్, మార్చి 26 మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు 5 రోజులుగా జ్యూస్ పంపిణీ చేయడం అభినందనీయమని హెచ్ఎం గోపాల్ కొనియాడారు. మంగళవారం నౌనురి శ్రీనివాస్ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న జ్యూస్‌ను విద్యార్థులకు అందజేసి మాట్లాడారు. పరీక్షలకు మొత్తం 143 మంది విద్యార్థులు హాజరైనట్లు సీఎస్ గోపాల్ తెలిపారు. ఇక్కడ నిర్వాహకులు నౌనురి శ్రీనివాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి

సిర్పూర్ (టీ), మార్చి 26 : హరితహారంలో భాగంగా ఈజీఎస్ ద్వారా నిర్వహిస్తున్న నర్సరీల్లో వేసవి కాలంలో మొక్కలు ఎండిపోకుండా తగిన జాగ్రత్తలను పాటించాలని ఎంపీడీవో సత్యనారాయణ ఆదేశించారు. మంగళవారం డోర్‌పల్లి, కర్జపల్లి గ్రామాల్లో నర్సరీలను పరిశీలించి మాట్లాడారు. రెండు పూటలా నీళ్లు పట్టాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రతి వరుసలో అన్ని మొక్కలు మొలకెత్తాయా? లేదా అన్నా విషయాలను పరిశీలించాలన్నారు. మొలకెత్తని చోట నాణ్యమైన విత్తనాలను తిరిగి విత్తాలని సూచించారు. ఉపాధాహామీ పనులను త్వరగా ముగించుకొని ఎండ ఎక్కువ కాకముందే కూలీలు ఇండ్లకు చేరుకునేలా ఎఫ్ఏలు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

గుడుంబా పట్టివేత

చింతలమానేపల్లి, మార్చి 26 : ఎస్సీ సురేశ్‌కుమార్ ఆదేశాల మేరకు అక్రమంగా గుడుంబా విక్రయాలు జరుపుతున్నారన్న ముందస్తు సమాచారంతో మండలంలోని రవీంద్రనగర్ గ్రామంలోని ఓ ఇంట్లో తనిఖీలు నిర్వహించగా 5 లీటర్ల నాటుసారా లభించినట్లు ఎస్ఐ నరేశ్ తెలిపారు. సారా అమ్ముతున్న పరితోస్ సర్కార్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. గుడుంబా విక్రయాలు చేస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.